క్లుప్తంగా

మిత్రుల చేయూత



ఖానాపురం : మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన రావుల వెంకటేశ్వర్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కాగా బాధిత కుటుంబానికి 1991–92లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు పరామర్శించారు. మృతిచెందిన స్నేహితుడు వెంకటేశ్వర్లుతో ఉన్న అనుబంధాలను నెమరువేసుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆసరాగా నిలవాలనే ఉద్దేశంతో రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నద్దునూరి కోటయ్య, గిరిబాబు, ఆలూరి ప్రసాద్‌రెడ్డి, బోను యశ్వంత్‌రెడ్డి, తాళ్ల భిక్షపతి, మాందార సాంబయ్య, బండి వెంకన్న, కేవీఎస్ చారితో పాటు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడు ఆంగోత్ రాజు

వర్ధన్నపేట : ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం వర్ధన్నపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం పట్టణశివారు తండాకు చెందిన ఆంగోత్ రాజు, మరో యువకుడు ద్విచక్రవాహనంపై వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో తీవ్రగాయాలు కాగా వారిని ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చెన్నారావుపేట : చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ముగ్దుంపురం గ్రామంలో గురువారం జరిగింది. ఎస్సై గూడ అరుణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన తోట రాజు(40)కి 18 ఏళ్ల క్రితం రాణి వివాహం జరిగింది. వీరి దాంపత్య జీవితంలో ఇద్దరు పిల్లలు ఉన్నారు. పదేళ్ల క్రితం రాణి, రాజుతో గొడవ పడి పిల్లలను తీసుకోని హైదరాబాద్‌లో నివాసం ఉంటుంది. పలుమార్లు రాజు తన భార్యను కాపురానికి రమ్మని కోరగా కుటుంబ కలహాల వల్ల రాలేదు. దీంతో రాజు జీవితంపై విరక్తి చెంది బుధవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కాగా గుర్రాల మల్లయ్య చూసి మృతుడి సోదరుడు సాంబరాజుకు సమాచారం ఇవ్వగా వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతు గురువారం మృతి చెందాడు. రాజు తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హమాలీ కార్మికులకు పనిభద్రత కల్పించాలి

పరకాల : హమాలీ కార్మికులకు పనిభద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జక్కు రాజుగౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ధమ్మల రాంమూర్తి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ హమాలీ వర్కర్స్ యూనియన్ డివిజన్‌స్థాయి సమావేశం పట్టణంలోని రైతువేదిక గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పనిభద్రతతో పాటు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. హమాలీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. 50 సంవత్సరాలు దాటిన హమాలీ కార్మికులకు రూ.3వేల పింఛన్, ఇళ్లు లేని కార్మికులకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడిదారులకు అనుకూల చట్టాలను తయారు చేయడం కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ పరకాల డివిజన్ అధ్యక్షుడు లంకదాసరి అశోక్, నాయకులు ఇల్లందుల రాములు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

డీబీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలి



ఆత్మకూరు : ఈనెల 30వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన డీబీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. మండలంలోని అక్కంపేటలో గురువారం మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. భారత రాజ్యాంగ పరిరక్షణతో పాటు హక్కుల కోసం డీబీఎఫ్ పోరాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలువేరు భిక్షపతి, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, మాజీ సర్పంచ్ మాదాసి కుమారస్వామి, నాయకులు మేకల సాంబయ్య, ప్రసంగి, రమేష్, శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయించొద్దు



నర్సంపేట రూరల్: ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న ఏఓ కృష్ణకుమార్



దుగ్గొండి: గిర్నిబావిలో విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ దయాకర్

నర్సంపేట రూరల్ : ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి కృష్ణకుమార్ హెచ్చరించారు. నర్సంపేట పట్టణంలోని ఎరువులు, విత్తనాల షాపులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ మాట్లాడుతూ 2024–25కు వానాకాలం సీజ్ ప్రారంభమైందని, ఇదే అదనుగా డీలర్లు విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రశీదు తీసుకోని, వాటిని జాగ్రత్తగా దాచిపెట్టుకోవాలన్నారు. రైతులు విత్తన డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే నర్సంపేట వ్యవసాయ కార్యాలయం ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సీజన్ ప్రారంభమైందని రైతులు తొందరపడి విత్తనాలు కొనుగోలు చేసి పొడి దుక్కుల్లో విత్తుకోని నష్టపోద్దన్నారు. రుతుపవనాలు వచ్చిన తర్వాత సరిపడా వర్షపాతం నమోదు అయితేనే విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఈఓలు మెండు అశోక్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌లో విత్తనాలు విక్రయిస్తే జైలుకే..

దుగ్గొండి : పత్తి, వరి ఇతర పంటల విత్తనాలను ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువకు విక్రయించినా, కొరత పేరుతో విత్తనాలు బ్లాక్ చేసినా డీలర్లు జైలుకు వెళ్లడం ఖాయమని మండల వ్యవసాయ అధికారి దయాకర్ అన్నారు. మండలంలోని గిర్నిబావిలోని పలు విత్తన దుకాణాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. పలు సీడ్స్ దుకాణాల్లో ఏ ఏ కంపెనీల విత్తనాలు అమ్ముతున్నారనే విషయాలను పరిశీలించారు. డిమాండ్ ఉన్న విత్తనాలను కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. ప్రతి రోజు ఏ రకం విత్తనాలు అమ్మారు. ఇంకా ఎంత నిల్వ ఉంది అనే విషయాన్ని షాపు ఎదుట ప్రదర్శించాలన్నారు. కేసుల పాలయితే షాపు యజమానుల భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. నిబంధనల ప్రకారం విక్రయించి రైతుల పరంగా న్యాయ బద్ధంగా ఉండాలని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, రాజు, ప్రవీణ్, అనిల్, సతీష్ పాల్గొన్నారు.

అకాల వర్షాలతో ఆగమాగం



దుగ్గొండి: విరిగిన మినీ ట్రాన్స్‌ఫార్మర్



వర్ధన్నపేటలో తడిసిన ధాన్యం

వర్ధన్నపేట : అకాల వర్షాలతో అన్నదాత అతలాకుతలం అవుతున్నాడు. ముంచుకొస్తున్న ముందస్తు వానాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యపు రాశులు తడిసి ముద్దయ్యాయి. ఇల్లంద వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోయిన ధాన్యం వర్షపు నీటిలో మునిగిపోయింది. ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కారణంగా ధాన్యపు రాశులపై ఏర్పాటు చేసిన టార్పాలిన్లు, పరదాలు కొట్టుకుపోయి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. వర్షం కారణంగా తేమ శాతం రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమశాతంపై నిబంధనలు సడలించి కొనుగోళ్లలో వేగం పెంచాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు

దుగ్గొండి : మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారుజామున కురిసిన గాలివాన బీభత్సానికి విద్యుత్ స్తంభాలు, మినీ ట్రాన్స్‌ఫార్మర్లు విరిగి కిందపడ్డాయి. నాచినపల్లి గ్రామ పరిధిలో 10 విద్యుత్ స్తంభాలు విరిగి పోగా మినీ ట్రాన్స్‌ఫార్మర్ గాలివానతో కిందపడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సిబ్బంది ఉదయం 6 గంటలనుంచి సాయంత్రం 4గంటల వరకు శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు



వర్ధన్నపేట: ఇల్లంద వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



రాయపర్తి : కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

నెక్కొండ : మండలంలోని పనికర గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణం గురువారం అంగరంగం వైభవంగా సాగింది. వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామస్తులు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్నెపల్లి ప్రతాప్‌రెడ్డి మహా అన్నదానంను నిర్వహించారు.అలాగే సాయంత్రం ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదక్షణ నిర్వహించిన అనంతరం లక్ష్మీనరసింహస్వామిని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. రామసాయం ఉపేందర్‌రెడ్డి, దేసు కుమారస్వామి, కపిల్, కొత్త వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సముద్రాల అనిల్, కోల లక్ష్మణ్, కాషబోయిన మల్లయ్య, కొత్త సమ్మిరెడ్డి, నాంచర్ల లక్ష్మ ణాచారిలతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తిర్మలాయపల్లిలో..

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లి గ్రామంలో గురువారం లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ వేడుకను కనులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పరాశరం సుదర్శనాచారి, భరత్, కిరణ్‌కుమార్, భక్తులు అనంతప్రసాద్, దొంతరబోయిన సారమ్మ, బొమ్మినేని గోపమ్మ, మెరుగు అరుణ, నిమ్మల రాజమ్మ, బొమ్మెర ఉపేంద్ర, అనిత, అన్నెపు అరుణ, సుజాత, రజిత, హైమ పాల్గొన్నారు.

రూ.3,21,116 విరాళం అందజేత

తిర్మలాయపల్లి నిర్మించిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయం అభివృద్ధికి జినుగు రవీందర్‌రెడ్డి కుమారుడు, కోడలు కిషోర్‌రెడ్డి, సంధ్య దంపతులు రూ.3,21,116లను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు వళపాక కుమారస్వామి, గజవెల్లి అనంతప్రసాద్, మాజీ ఎంపీటీసీలు గుడి మైబురెడ్డిలు సన్మానించారు.

కమిటీ ఎన్నిక



బుర్రి యాదగిరి, అధ్యక్షుడు



లింగాల క్రాంతికుమార్



అంబాల క్రాంతికుమార్

చెన్నారావుపేట : మండల ఫర్టిలైజర్, పెస్టిసైడ్, సీడ్స్ డీలర్స్ కమిటీని గురువారం చెన్నారావుపేటలో రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బుర్రి యాదగిరి, ఉపాధ్యక్షుడిగా లింగాల సంతోష్, కార్యదర్శిగా అంబాల క్రాంతికుమార్, గౌరవ సలహాదారులుగా లింగాల సూరయ్య, రాకం దేవేందర్, మేడి కట్టయ్య, కమిటీ సభ్యులుగా తాటికొండ కోటి, కందికొండ రవి, నిలిగొండ సూరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని పద్మశాలీ గార్డెన్‌లో నేడు(శుక్రవారం) పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు బీజేపీ నర్సంపేట నియోజకవర్గ నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఈటల రాజేందర్, గరికపాటి మోహన్‌రావు, వరంగల్–ఖమ్మం–నల్లగొండ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని విద్యావేత్తలు, మేధావులు, డాక్టర్లు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, పట్టభద్రులు, అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- చెన్నారావుపేటలో ఎమ్మెల్సీ ఓటర్లు 1,697
- రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- అడిషనల్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఫణికుమార్



ఫణి కుమార్

చెన్నారావుపేట : మండలంలో పట్టభద్రుల ఓటర్లు మొత్తం 1,697 మంది ఉన్నారని అడిషనల్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఫణీ కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 27న (సోమవారం) వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. చెన్నారావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 153, 154 రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. గ్రామంలోని పట్టభద్రులు చెన్నారావుపేట మండల కేంద్రానికి చేరుకొని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ పాలనలోనే సమన్యాయం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



అభివాదం చేస్తున్న నాయకులు

నర్సంపేట: కాంగ్రెస్ పాలనలోనే సమన్యాయం జరుగుతుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తీన్మార్ మల్లన్నను గెలిపిస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, డీసీసీ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి



పర్వతగిరి: ప్రచారం చేస్తున్న కొండేటి శ్రీధర్

పర్వతగిరి : వరంగల్–నల్లగొండ–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ కోరారు. మండలంలోని పట్టభద్రుల బూత్‌లో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బూత్ కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం ఆయా బూత్‌లలో ఇంటింటికి వెళ్లి పట్టభద్రులు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ చదువు రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వినోద్, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, యాకాంతం గౌడ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కొండేటి

వర్ధన్నపేట : వరంగల్, నల్లల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ కోరారు. గురువారం వర్ధన్నపేట పట్టణకేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

గీసుకొండ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబు కోరారు. గురువారం గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో ఇంటింటి ప్రచారం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

‘తీన్మార్ మల్లన్నను గెలిపించండి’



నెక్కొండ : మాట్లాడుతున్న బక్కి అశోక్



సంగెం: ప్రచారం చేస్తున్న నాయకులు



చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పాపయ్యపేటలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కంచ ప్రభాకర్, మజ్జిగ రాంబాబు, అన్నెబోయిన సునీల్, సూర లింగమూర్తి, భూక్య బాలాజీ, ఉప్పరి వీరస్వామి, కన్నం సందీప్ పాల్గొన్నారు.

మల్లన్నకు అండగా నిలవాలి

నెక్కొండ : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు అండగా నిలువాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ అన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు గురువారం నర్సంపేటలో జరిగిన వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశానికి నాయకులు, పట్టభద్రులు తరలివెళ్లారు. పెండ్యాల హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు బండి శివకుమార్, సింగం ప్రశాంత్, చల్లా శ్రీపాల్‌రెడ్డి, గైలక్ష్మణ్, రాచకొండ రఘు, లావుడ్యా తిరుమల్ చౌహాన్, బొడ్డుపల్లి యాదగిరి, మెండె కుమారస్వామి, రావుల తిరుపతిరెడ్డి, దిలీప్ పాల్గొన్నారు.

సంగెంలో..

సంగెం : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ కళావతి పిలుపు నిచ్చారు. గురువారం సంగెం మండల కేంద్రంలోని పట్టభద్రులను కలిసి ఓట్లు వేయాలని కోరారు.

‘ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి’



నర్సంపేట: మాట్లాడుతున్న డాక్టర్ రవీందర్‌రావు



ఖానాపురం: బుధరావుపేటలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది పక్కన రవీందర్‌రావు

నర్సంపేట : వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ డాక్టర్.రవీందర్‌రావు, రాష్ట్ర ఆర్ఎస్ఎస్ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డిలు కోరారు.ఈ మేరకు పట్టణ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ గోనె యువరాజు, రాయిడి దుశ్యంత్‌రెడ్డిల అధ్యక్షతన గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. క్లస్టర్ బాధ్యులు బండి రమేష్, వెనుముద్దల శ్రీధర్‌రెడ్డి, నాగిశెట్టి పద్మప్రసాద్, మండల శ్రీనివాస్, బీరం నాగిరెడ్డి, దేవోజు హేమంత్, నాయిని వేణు, పోతరాజు బాబు, సాలయ్య, రవి, కమల్, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధిచెప్పాలి

ఖానాపురం : నోటిఫికేషన్లు ఇవ్వలేని, రైతులకు విద్యుత్, ఎరువులు, విత్తనాలు అందించలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టభద్రులు ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ రవీందర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని బుధరావుపేటలో గురువారం ప్రచారం నిర్వహించి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల తరఫున ప్రశ్నించే గొంతుక శాసనమండలిలో ఉండాలన్నారు. పదేళ్ల కాలంలో అత్యధిక ఉద్యోగాలు కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, శ్రీనివాస్‌గౌడ్, మహలక్ష్మి వెంకటనర్సయ్య, ఎమ్మెల్సీ మండల కన్వీనర్ మస్తాన్, లింగయ్య, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పట్టభద్రులు విజ్ఞతతో ఓటు వేయాలి

నెక్కొండ : ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పట్టభద్రులు విజ్ఞతతో ఓటు వేయాలని నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ డాక్టర్ రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం మండల ఎన్నికల ఇన్‌చార్జ్, పీఏసీఎస్ చైర్మన్ మారం రాము అధ్యక్షతన నిర్వహించిన నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, ప్రైవేట్ టీచర్లు, మేధావులు నిరుద్యోగులు, యువత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి, నాయకులు కొమ్ము రమేష్ యాదవ్, తాటిపెల్లి శివకుమార్, బొల్లెబోయిన వీరస్వామి, జుట్టుకొండ వేణు, జంపాల కేదారి, బొడ్డపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

‘రాకేశ్‌రెడ్డి గెలుపు ఖాయం’

సంగెం : వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగు రాకేశ్‌రెడ్డి గెలుపు ఖాయమైందని పట్టభద్రుల ఇన్‌చార్జ్‌లు కత్తెరపల్లి దామోదర్, యార బాలకృష్ణ, జున్న రాజులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాకేశ్‌రెడ్డికి విద్యావంతులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఉన్నత విద్యావంతుడికే పట్టం కట్టాలి

దుగ్గొండి : పట్టభద్రులు పెద్దల సభకు విలువలు గల ఉన్నత విద్యావంతుడికే పట్టం కట్టాలని ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ డా.రవీందర్‌రావు అన్నారు. మండలంలోని గిర్నిబావిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

గీసుకొండ : మండలంలోని దస్రుతండాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఆ పార్టీ పరకాల నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జూలూరి లెనిన్ ప్రచారం చేశారు. మోతిలాల్, రమేశ్, నరేశ్, గణేశ్ ఉన్నారు.

ఎండల్లో హాయి హాయి..!



వాగులో సేదదీరుతున్న బాతులు

చెన్నారావుపేట: ఎండలు మండిపోతున్నాయి. అప్పుడప్పుడు వర్షాలు కురిసినా ఎండ తీవ్రత మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. మధ్యాహ్నం వేళ ఒకవైపు ఎండ మరోవైపు ఉక్కపోతతో జనం తట్టుకోలేకపోతున్నారు. పశుపక్ష్యాదులు సైతం ఎండకు అల్లాడిపోతున్నాయి. గురువారం మధ్యాహ్నం బాతుల గుంపు పాత ముగ్దుంపురం పక్కనే ఉన్న వాగు నీటిలో సేదతీరాయి.